ప్రపంచం వెలివేసిన
అతణ్ణి
ధీరోదాత్తుడిలా
నడిపించిన
ఆమె ఎవరు?

# చెలిమి చైత్రం

ఆచాళ్ల
శ్రీనివాసరావు
కథ

డిసెంబర్ నెల, సాయంత్రపు చిరు చలిగాలి ముప్పయి అయిదేళ్ళ శరీరాన్ని సన్నగా వణికిస్తోంది. సంక్రాంతి ప్రత్యేక సంచికకి కథ వ్రాయాలని కాగితాలు ముందేసుకొని టీ త్రాగుతూ డాబామీద ఈజీఛైర్ లో కూర్చుని ఆలోచిస్తున్నాను. 'పోస్ట్' అన్న కేకతో ఆలోచనంకి అంతరాయం. వంటవాడు ఓ కవరు పైకి తీసుకొచ్చి యిచ్చాడు. చాలా పరిచయమైన దస్తూరి. ఉత్తరం సాహితినుంచి. సోషల్ ఏంత్రోపాలజీలో తను సబ్‌మిట్ చేసిన థీసిస్ ఓ.కె. అయిందనీ, డాక్టరేట్ రాబోతోందనీ, కాన్వొకేషన్‌కి జర్నలిస్ట్ హోదాలో కాకుండా తన స్నేహితుడిగా రమ్మనీ వ్రాసింది. వంటవాడి చేతి భోజనం నుంచీ, ఉద్యోగపు తల'తిరుగుడు' నుంచీ విశ్రాంతి అవసరమనీ, కొన్నాళ్ళు సెలవు పెట్టి తన దగ్గరకొచ్చేయమనీ వ్రాసింది. వచ్చేటప్పుడు కెమేరా తెమ్మనీ, తన పిల్లలిద్దరూ బాగా అల్లరి చేస్తున్నారనీ వ్రాసి ముగించింది.

ఉత్తరం చదువుతున్నంతసేపూ మనసంతా ఏదో అవ్యక్తానందంతో నిండిపోయింది. కథ కంచికే... మనసు మాత్రం పదేళ్ళ గతంలోకి... పాతికేళ్ళ ప్రాయంలోకి...

...పదేళ్ళ క్రితం... నా జీవితపు అత్యంత విషాదమయ దినాలలో అనుకోని పరిచయమయింది సాహితి. చిన్న మనస్తాపంతో ఉన్న ఉద్యోగాన్ని వదులుకోవల్సిరావడం— ఎదురింటి 14 ఏళ్ళ అమ్మాయినుంచీ, ఇంట్లో అమ్మవరకూ అంతా జాలిగా, సానుభూతిగా చూడటం, మాట్లాడటం. నాన్న మౌనం—




కనుల కవన కుసుమాలకి కలల పదపుప్పొడి అవుతుందనుకున్న అమ్మాయి సరళ కళ్ళలో అర్థంకాని ఏవగింపూ— ముడుతపడ్డ ఆమె నుదిటి గీతల్లో అర్థంకాని విసుగూ— అయినా విసుగు చెందకుండా— 'నవ్వే నీ కనులు నాకు శుభోదయం పలకాలి, నల్లని నీ కురులు నాకు నిదుర ముసుగు కప్పాలి'— అనో, నింగీ నేల కలిసేచోట నీ రాకకై నే వేచివుంటా,

మనసూ మమతా రాగాలు చేసి నీ కోసమే నా పాదుకుంటూ' అవో ఉత్తరాలు వ్రాస్తే ఆ అమ్మాయి తండ్రి పోలీస్ రిపోర్ట్ యివ్వడం, మూడుముళ్ళతో ఏడడుగులు నడుస్తుందని ఆశిస్తే, మూడు గంటలసేపు పోలీస్ స్టేషనులో నిర్బంధం, ఏడు ఊసలు లెక్కపెట్టవలసి వస్తుందని బెదిరింపూ– నాలో ఏదో ఇరిటేషన్, పాతికేళ్ళ వయసులో ఆ వయసు కోరికలకి భిన్నంగా కాసింత లాలిత్యం కోసం తపన, ఫ్రస్టేషన్. ఇటువంటి విషాదమయ దినాలలో... కాష్టంలా రగిలే దృశ్యంలో సాయంత్రపు వాన చినుకులా, వేసవి వడగాలులలో మల్లెల ఓదార్పులా అతి సన్నిహితమైంది సాహితి.

అప్పటికి నాలుగేళ్లుగా ఓ పబ్లిక్ స్కూల్‌లో ఉద్యోగం, నాలుగంకెల్లో జీతం. ఉన్న ఊరూ, స్వంత యిల్లూ, సాయంత్రాలు లైబ్రరీ, రాత్రయితే సిగరెట్లూ, సాహిత్యపు పుస్తకాలూ తోడు. తెలిసీ తెలియని వయసులో విరిసీ విరియని మనసులో చోటు చేసుకున్న ప్రేమ తాలూకు విషాదం తప్పితే మిగతా జీవితమంతా చాలా హుషారుగా గడిపిన రోజులవి. రోజులెప్పుడూ ఒకలా వుండవనేది నాయనమ్మ. అవును రోజుల మాటెలావున్నా అన్నిరోజులూ జీవితం ఒకలా వుండదు. సాఫీగా సాగుతున్న జీవితంలో చిన్న కుదుపు. సంపాదకత్వపు ధ్యేయం 'సంపాదన'గా భావించే చిన్ని స్థానిక పత్రిక స్కూల్‌కి సంబంధించి ఓ వార్త ప్రచురిస్తూ, అంతకు ముందు మూడు గంటలసేపు నేను పోలీసు స్టేషన్‌లో నిర్బంధించబడిన వైనాన్ని దృష్టిలో వుంచుకొని వన్నొక ఉమనైజర్ సృష్టించింది. అంతే... చాలా ఎఫిషియంట్ టీచర్‌గా మేనేజిమెంట్‌కి నామీద వున్న అభిమానం, పిల్లల ఆత్మీయులతా, యింటి ఆర్థిక పరిస్థితి ఏవీ నన్ను ఉద్యోగం నుంచి రాజీనామా చేయకుండా ఆపలేకపోయాయి. స్కూలు ప్రతిష్ఠ నా కారణంగా దెబ్బ తినడానికి మనసొప్పలేదు. సరిగ్గా అలాంటి సమయంలో కేవలం సాహిత్యాన్ని ఆలంబనగా తీసుకొని బతుకీడుస్తున్నపుడు పరిచయమైంది సాహితి.

ఓ సాయంత్రం లైబ్రరీ మేడమీద వరండాలో నిలబడి 'బోర్న్ టు విన్' చదువుతుంటే 'హలో' అన్న పలకరింపు. కృష్ణశాస్త్రి కవిత్వపు లాలిత్యాన్ని గోరిన కోకిలా గీవపు ఆర్ద్రత ఆ స్వరంలో. పుస్తకంలోంచి దృష్టి మళ్ళిస్తే ఎదురుగా రెండు పదుల వయసుండే అమ్మాయి. పచ్చటి పరికిణీ, తెల్లటి ఓణీ, గోరింటాకు పెట్టిన అరచేతిలో ఒద్దికగా ఒదిగిన 'అమృతవీణ' పలకరించింది నన్ను కాదేమో అన్న సంశయం, అయితే 'ఎందుకు' అనే విసుగూ. Silence is the only word that I can utter with this world అనే నిర్లిప్తత. ఫలితం – పలకరింపుకి బదులు మౌనం.

"రచయితలు కాగితాలమీద తప్ప మాట్లాడరనుకుంటా" నెమ్మదిగా కానీ స్పష్టంగా. శృతి బిగిలో వీణ తీవెని నెమలి రెక్కతో మీటినట్లు. అప్పటికి నిర్ధారణ అయింది ఆమె నన్నే పిలుస్తున్నట్లు. ఎదురుగా బల్లమీద నా కథ అచ్చయిన తెరచివున్న 'భారతి'. పక్కనే నవ్వుతున్న లైబ్రేరియన్ చేతిలో నా డిపాజిట్ కార్డూ. సందేహం లేదు ఆమె పిలుస్తున్నది నన్నే. 'హలో' నువ్వు... సారీ మీరూ... పుస్తకం మూసి ఆమెపేరు

గుర్తురాక సందిగ్ధంలో సగంలో ఆపేసాను.

"నేను ఎవరూ అనే ప్రశ్నకి ఇరవై ఏళ్ళుగా నా దగ్గరా జవాబు లేదు. పేరు సాహితి. స్వరసాహితి. No exclamatary face. నేనేం కృష్ణశాస్త్రి కలలలోంచి జారిపడలేదు. అమ్మకి సంగీతంలో అభిరుచి, నాన్నకి సాహిత్యమంటే ఇష్టం. వెరసి నాపేరు స్వరసాహితి..." ఇంకా ఏదో మాట్లాడుతూనే వుంది. నేనప్పటికి ఆశ్చర్యం నుండి తేరుకుని లైబ్రరీ గోడవైపు చూపు సారించాను. "Silence is the perfectest herold of joy" అన్న షేక్స్‌పియర్ వ్యాఖ్య ఆ గోడమీద. ఆమె అది చూసి 'సారి పదండి వెళదాం' అని బయటకి దారి తీసింది. అనుసరించాను. లైబ్రరీ నుండి బయటకి రోడ్డుమీదకి వచ్చాక 'రండి ఇంటికి వెళ్ళి మాట్లాడుకుందాం' అని ఆమె సమాధానంకోసం చూడకుండానే ఇంటివైపు అడుగులు వేసాను. అనుసరించింది. నడక.. . లైబ్రరీ నుండి ఇంటికి... మధ్యలో గుడికి, రమ్మని తానూ, రానని నేనూ, 'పోనీ ఓసారి వెళితేనేం...

ఊహూ చాన్నాళ్ళ క్రితం వదిలేసిన అలవాటు.

"మీరెళ్ళిరా నేనుంటాను".

ఊహూ పదండి పోదాం." దారిలో పది నిముషాల నడకలో ఎన్నెన్ని కబుర్లనీ.


"మేం చిన్నపుడు మీ ఇంటిపక్కన వుండేవాళ్ళం గుర్తుందా" అని అడిగింది.

ఒక్కసారిగా మరుపు మబ్బులు విడి బొట్టు బొట్టుగా జారిన బాల్యంపు వెన్నెల తునకలు...

...సూరిగాడితో కలిసి ఆడుకున్న గోటీ బిళ్ళ, రోడ్డుపక్కన ఏరుకున్న బచ్చాముక్కలూ, కార్తీకపు చలిలో సెలయేటి స్నానాలూ, అట్లతద్దికి అక్కలకంటే ముందుగా లేచి దొంగతనంగా తినేసిన ఉట్టి క్రింద ముద్దా- నాయనమ్మ తిట్లూ... వీటన్నిటిమధ్యా లీలగా అస్పష్టంగా ఓ రూపం. పొట్టి జుట్టూ, పట్టు గౌనూ... "My goodness you

## అబద్ధం!

"ఏరా అనిల్ అన్నీ అబద్ధాలు చెప్తున్నావు తప్పుకదూ! నేనస్సలు అబద్ధాలాడేవాడ్ని కాదు తెల్సా?!"
విద్యార్థిని మందలించాడు టీచర్.
"మరి అబద్ధాలాడటం ఎప్పుడు మొదలెట్టారు సార్...?"



—ఎం.బి.కళ్యాణి (బెండమూర్లంక)

you are that little gayసాతీ...''

ఒత్తుగా రావాలని జుత్తు కత్తిరిస్తే పొడుగు జడలు లేవని అమ్మదగ్గర పేచీ పెట్టిన అమ్మాయి. వీధిలో పిల్లలంతా 'జడలపిచ్చి' అని వెక్కిరిస్తే ఇంటికొచ్చి అమ్మ సవరాన్ని మెడకి చుట్టుకున్న అమ్మాయి. ఇప్పుడో పెద్ద అరిందాలా చేతిలో కృష్ణశాస్త్రి, మాటలో ఇంగ్లీషూ... ఆనందం, ఆశ్చర్యం... తేరుకునేలోగా చేరుకున్న ఇల్లు.

Welcome baby, this is your past paradise.

''అమ్మా...!'' చాన్నాళ్ళ తర్వాత ఇంట్లో గట్టిగా నా స్వరం. వంటింట్లోంచి పంచదార డబ్బా పట్టుకుని బయటికి వచ్చిన అమ్మ- ''ఏమిటా అరుపు? అని నాకన్నా గట్టిగానే అరవబోయి (ఈ విషయం అమ్మ నుదిటి ముడుతల విసుగు చెబుతుంది) వెనకనున్న అమ్మాయిని చూసి – ''ఈమె ఎవరో గుర్తుందా?'' అన్న నా ప్రశ్నకి లేదనే నిజాన్ని జవాబుగా చెప్పకుండా.

''రా కూర్చో'' అని పీట వాల్చింది. అవును 30 ఏళ్ళుగా రెవెన్యూ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగం చేస్తున్న నాన్నకి యించుమించు అన్నేళ్ళుగానూ సహధర్మచారిణి. లౌక్యాన్ని కాచి వడబోసింది. సాహితి పీటమీద కూర్చోలేదు. మా యింటి Topography-yలో వచ్చిన మార్పు గమనిస్తోంది. అష్టాచెమ్మాలాడుకున్న పెరటి అరుగుకోసం, వేసవి మధ్యాహ్నాలు కోతికొమ్మచ్చులాడుకున్న జామిచెట్టుకోసం, పసిమిరేకుల పసిడి ఛాయల బాల్యపు హేమంతపు చేమంతుల స్మృతి పరిమళాలకోసం వెదుకుతోంది. పిచ్చి పిల్ల. ఆమెకేం తెలుసు? కాసింత సెక్యూరిటీకోసం (వాక్యం మళ్ళీ! నిశ్చయంగా స్టేటస్ తెలుపుకోవటంకోసం) ఆనాటి కుటీరం నేడు మూడు వాటాల స్లాబ్‌గా మారిందనీ, దాని వెనక యింకా 30 వేల అప్పుందనీ.

''రా సాహితీ గదిలో కూర్చుందాం.''

వంటింటి వసారాలోంచి వీధి గదిలోకి నడక. తోడుగా మౌనం.

మంచంమీద చెదిరిన దుప్పటి, చెల్లాచెదురుగా పడున్న కాగితాలు, న్యూస్ పేపర్లు. గోడమీద బూజుపట్టిన పెయింటింగ్స్, పోస్టర్లూ వాటి కింద పెన్సిల్‌తో వ్రాసుకున్న కవిత్వం. రెండలమార్లనిండా అస్తవ్యస్తంగా వున్న పుస్తకాలు, మధ్యాహ్నం కట్టడం మరిచిపోయిన టి.వి.

ఉదయం తాగిన కాఫీగ్లాసు, చుట్టూ ముసిరిన ఈగలూ, దండెంమీద వేలాడుతున్న స్లాక్స్, జీన్సూ... అక్కడక్కడా దోమలూ.

''నిర్లక్ష్యం మీ యింటిపేరా'' అంటుందని భయం.

'కూర్చో'. కూర్చోలేదు పుస్తకాలు వెదుకుతోంది.

'మంత్రనగరి సరిహద్దులు ముట్టకు' అందామనుకున్నాను.

'ఏంటివన్నీ?' అంది ఒక్కో పుస్తకం చూస్తూ.

'నిదుర రాని నిశిరాతిరి ఎదనొదిగే పుస్తకాలు

ఎద రగిలే వేదనలో ఓదార్చే నేస్తాలు'

అన్నానా? అనుకున్నానా?

ఏమో సరిగా గుర్తులేదు.

–బావుంది

–ఏమిటి?

–కవిత్వం.

'అమ్మ చేసిన కాఫీ యింకా బావుంటుంది తీసుకో'.

ఫ్లాస్క్‌లో కాఫీ గ్లాసులో పోసి అందించాను.

కరెంట్ పోయింది.

'ఉహు ఉక్కగా వుంది యిక్కడ కాఫీ ఏంటి?'

'పెరట్లోకి వెళదాం నడు' – నడిచాం.

పెరట్లోకా? బాల్యంలోకా?

కొబ్బరిచెట్టూ, నూతిగట్టూ, గడ్డిమేటూ, సంక్రాంతొస్తే బంతిపూల దండలో మువ్వలు కట్టి మెడ నలంకరిస్తే పెరడంతా మహాలక్ష్మిలా పరుగెత్తే ఆవుదూడా.

బూజుపట్టిన కుర్చీలు లేవు.

ఆకులు రాలిన నూతిగట్టే. కూర్చో – కూర్చున్నాం.

"ఏంటి యిప్పుడు చెప్పండి, మీరీమధ్య బాగా సీరియస్‌గా వుంటున్నారట" అనుకోని ప్రశ్న ఆమెనుండి.

క్రింది పెదవిని రెండు వేళ్లతో నొక్కిపెట్టి, ఉంగరం వేలితో గడ్డం సవరించుకుంటూ అడిగాను – 'ఎవరు చెప్పారు?'

'అన్నపూర్ణ, మీ కొలీగు, నా దోస్తు. స్కూల్లో జరిగిన గొడవంతా చెప్పింది. మీమీదొచ్చిన రూమర్ నుంచీ, మీ రిజిగ్నేషన్ వరకూ అంతా..."

చెట్టుమీద ఓ కాకి తొంగిచూస్తోంది. నూతిలో మరో కప్ప తల పైకెత్తి వింటోంది. పక్కింటి డాబామీద నుండి అమ్మలక్కలు సరేసరి. కాని మౌనమే నా సమాధానమైంది. ఆ మౌనం భావం సాహితికి అవగతమైంది.

'మీకోమాట చెప్పనా'.

'ఊఁ చెప్పు'.

'మీరు మీ మనసుకి మాత్రమే జవాబుదారీ. యిది సానుభూతి కాదు. యింకావిషయం వదిలేయండి' అంది.

అదిగో సరిగా అప్పుడొచ్చాయి

## బాప్ రే!



శరీరంలోని ఎముకలు దృఢంగా వుండటానికి, దంతాలు ఆరోగ్యంగా వుండటానికి కాల్షియం అవసరం! కానీ కాల్షియం పరిమాణం ఎక్కువైతే క్యాన్సర్ వచ్చే అవకాశాలున్నాయంటున్నాడు–సైంటిస్ట్ రవికాంత్ గోయల్! పాన్ నమిలే వారిలో (సున్నంలో కాల్షియముంటుంది) పిల్లలకు పాలిచ్చిన స్త్రీలలో (పాలద్వారా కొంత కాల్షియం బయటికి వెళ్తుంది) అధిక మోతాదులో కాల్షియం వుండటంవల్లనే వారికే ఎక్కువగా క్యాన్సర్ వస్తోందని ప్రయోగాలద్వారా కనుక్కున్నాడు.

–జీవా

కన్నీళ్ళు.

మేల్ ఇగో రెప్పల గాజులళ్ళు స్రైతం స్రవించి గుండె తడిని బొట్టు బొట్టుగా కళ్ళవెంట జార్చిన క్షణాలవి. ఆ క్షణం స్నేహంలోని స్వచ్ఛత ఓదార్పుగా మారి ఆ సాయంత్రం సాహితి మాటలైన క్షణాన... అప్పుడొచ్చాయి కన్నీళ్ళు కానీ కాసింత ఓదార్పుకోసం వెర్రిమనసు వెక్కివెక్కి ఏడుస్తున్నా కదిలే నీలిమేఘం కన్నుల్లోనే కరిగి కురిసే నీటిచుక్క జాలిని భరించలేని మాస్క్యులేనిటీ.

'పద సాహితీ చీకటి పడింది'. లేచింది.

బయలుదేరాం. నడక రెండు కిలోమీటర్లుంటుంది. మా యిళ్ళ మధ్య దూరం. నడక– కబుర్లు.

'యింటికి ఏం చేస్తున్నావ్ సాహితీ'

'మీ పక్కన నడుస్తున్నాను.'

స్పాంటేనియస్‌నెస్‌కి నవ్వొచ్చింది.

'నేనడిగింది నీ చదువు గురించి'

బి.ఏ మూడో సంవత్సరం ప్రైవేటుగా.

కాలేజీలో సీటు రాలేదా? – అటూ యిటూ చూస్తూ అడిగాను.

అటు– మూడు రోజుల క్రితం మొదటి సారి షేర్ చేసిన కాలేజీ క్లాస్‌మేట్ వింక్సియుటీ చూపులూ–

యిటు – మూడో భార్య రెండో కూతురికి సాల్ట్ బిస్కెట్స్ తినిపిస్తున్న ఎదురింటి వృద్ధ జంబుకపు జరదా నవ్వు ఇతగాడు సెంట్రల్ గవర్నమెంట్‌లో రిటైరై ఆరేళ్ళవుతోంది. మూడో పెళ్ళి చేసుకుని అయిదేళ్ళయింది. మొదటి పెళ్ళాం రెండో కాన్పులో పోయింది. రెండో ఆవిడ ఈయన జరదా కిళ్లీల ఉమ్ముల ప్రవాహంలో కొట్టుకు పోయిందని లబ్ధప్రతిష్ఠల భోగట్టా. ఈ వయసులో నాలుగు మెతుకులకోసం చేతులే ం కాల్చుకుంటాను?

ఏదో పెన్షన్ లెంటూ యింట్లో పడుంటుందని..'' అన్నాడు మూడో పెళ్ళికి నాలుగు రోజుల ముందుగా.

అటూ యిటూ దిక్కులు చూడ్డమేనా నడుస్తారా'– అంది సాహితి. మళ్ళీ నడక. ఓ జీవితకాలం సాగితే బాగుండుననిపించిన నడక. దారిలో కబుర్లు. కుటుంబ విషయాలనుంచీ, కుటుంబరావు సాహిత్యం వరకూ. మెయిన్ బజార్ దాటి రైల్వే వంతెనదాకా వచ్చాం.

"వంతెన మీద నడుద్దామా"– అంది. రైలు బోగీతో ఆడుకుంటూ "మూవ్ ... అప్ప ... " అనే ... లౌల్యం ఆ ...

'సరే పద!' పదుస్తున్నాం పట్టాల వెంబడి వంతెన మీదుగా. ఆమె పాదాల పట్టీల మువ్వల సవ్వడి లయబద్ధంగా.

చలో మేరీసాత్,

ఆసొంకీ బరసాత్‌మే మిలీ తేరీ హాత్

చలో ప్రభాతక్

జహా ఖీర్ ఖుషియా ఔర్ హాసియా

(కేఫూల్ – (స్వీయం)

అనిపించిన నడక.

పట్టాల మధ్య పాదాల నడక. మెటీరియలిజానికీ, సెంటిమెంటలిజానికీ మధ్య జీవితపు నడక. ఏదీ శాశ్వతం కాదు. అయితేనేం

ఆపాదించిన స్నేహాన్ని, అనుభూతించిన అనుభవాన్ని అందించిన క్షణాల మాధుర్యపు జ్ఞాపకాలు క్షణికం కాదు.

కొద్ది క్షణాల్లో యిల్లు చేరుకున్నాం. ఆ చుట్టుపక్కల యిళ్ళన్నింటికీ కాస్త భిన్నంగా – వాకిట వరిపిండితో పెట్టిన ముగ్గూ, కాంపౌండ్ వాల్ నానుకుని హైబ్రిడ్ కొబ్బరి చెట్టూ, మరోపక్క మందారమొక్కా, మధ్యలో మల్లెపందిరీ, టెర్రెస్ మీద కుండీలలో మరువం, బంతీ, దవనం, గులాబీ.

'యిదే యిల్లు రండి' అంది.

ఊహు మరోసారెప్పుడయినా–

అదేంటి యింత వరకూ వచ్చి.

''సిగరెట్లయిపోయాయి వుంటాయా యింట్లో''

ఊహు నాన్నచేత మానిపించేశా...

'అందుకే వెళతాను. గుడ్‌నైట్ అండ్ థాంక్స్.

థాంక్స్ ఎలాట్.

–దేనికీ థాంక్స్?

ఈ సాయంత్రం కురిపించిన సానుభూతికి.

'అదిగో అలా అయితే నీతో మాట్లాడనంతే. చెప్పానుగా యిది సానుభూతి కాదని' అంది.

అలా అయితే నీ జుట్టు పీసబ్బా.. అన్న బాల్యపు స్నేహత్వం, లాలిత్యం ఆమెలో.


మరేంటి సాహితీ... అన్నాను.

''చెప్పానుగా మీరు మీ మనసుకే జవాబుదారీ. సంఘానికి కాదు. మీరు స్వచ్ఛంగా వున్నంత వరకూ ఎవరేమనుకున్నా పట్టించుకోనవసరం లేదు. గడ్డాలు పెంచుకుని ట్రాజెడీ హీరోలా సిగరెట్లు కాల్చుకుంటూ తిరగక్కర్లేదు.''

పలక మాస్టారి చేతికిచ్చి పదమూడో ఎక్కం పన్నెండ్ల వరకూ అప్పచెప్పిన బాల్యం కనిపించింది ఆమెలో మళ్లీ.

నా పెదవులపై చిరునవ్వు.

థాంక్స్ చేటీ కానీ యివన్నీ అదే



"మనసుకి నచ్చినట్లు చేయడం, ఎవరేమన్నా పట్టించుకోకపోవడం... కేవలం కథలలో పాత్రలకే సాధ్యం" అన్నాను.

కథలలో ఊహించుకునే అపురూపమైన పాత్రలు జీవితంలో స్నేహం రూపంలో తారసపడితే కీట్స్ కవిత్వపు లాలిత్యము, షెల్లీ కవనపు హార్లీశకమూ జీవితంలోనే అనుభవించి పలవరిస్తామని ఆక్షణం కనీసం ఊహించలేదు నేను.

ఓ.కె. గుడ్‌నైట్ వస్తాను అని బయలుదేరాను.

'ఎప్పుడు? అంది ఏదో అర్థంకాని పట్టుదలా అపారమైన ఆత్మీయలా ఆ లేత వెన్నెలలో ఆమె కన్నులలో.

రేపు సాయంత్రం బయలుదేరి కాకినాడ దగ్గర ఓ పల్లెటూరు పెళ్ళికి వెళ్ళాలి. తర్వాత ఎప్పుడయినా వస్తాను' అని బయల్దేరాను. సరే జాగ్రత్తగా వెళ్ళండి గుడ్‌నైట్ అంది. జాగ్రత్తగానే యింటికి వెళ్ళాండి. ఆ రాత్రి చాన్నాళ్ళ తర్వాత చాన్నాళ్ళుగా నిద్రకోసం వేసుకునే ట్రాన్‌క్విలైజర్స్ వాడకుండా ఆ సాయంత్రపు జ్ఞాపకాలలోకి, నిశ్చలంగా అమ్మ ఒడిలో ఒదిగినట్లు... అలా...నిద్రలోకి.

ఆ మరునాడు మిత్రుని కలల పాట కళ్యాణ కాహిళిలో మ్రోగే వేదికని తిలకించేందుకు ప్రయాణమై బస్ కాంప్లెక్స్‌లో ఎదురుచూస్తున్నప్పుడు– దూరంగా కనిపించిన నడకలవడి, దగ్గరయి వినిపించిన అడుగుల సడి– సమీపంలో సాహితి. చేతిలో చిన్న వేనిటీ బేగ్, పోలిథిన్ కవర్‌లో మడిచిన చీర. వాటి మధ్యగా దేవులపల్లి 'అమృతవీణ'.

"ఎంతసేపయింది మీరొచ్చి...?"

"మూడు సిగరెట్ల జీవితకాలం..."

రండి అక్కడ వెయిట్ చేద్దాం... సమీపంలో మామిడి చెట్టుని చూపిస్తూ అంది.

"పరే నడు" ఆమె చేతిలో పుస్తకాన్ని మాత్రం తీసుకుని తిరగేస్తూ, మునుపు చదివిన గీతాలు స్మృతించుకుంటూ... చెట్టు నీడకి చేరాం. మళ్ళీ కబుర్లు. కృష్ణశాస్త్రిమండీ కీట్స్ వరకూ... మధ్య మధ్యలో బస్ హారన్ల హార్మొనీ మోత. ప్రయాణీకుల రొద. పిల్లలకి కామిక్స్, కాడ్‌బరీసూ కొంటున్న బేంక్ మేనేజర్ – చందమామ, చాక్లెట్లూ కొనమని తల్లిని వేధిస్తున్న ప్లీడర్ గుమస్తా పిల్లలూ.

ఓహ్ ఇట్స్ టెరిబులీ స్వెట్టీయార్... అంటూ నిమిషానికి ఏ పదహారుసార్లో హాంకీతో ముఖాన్నద్దుకుంటున్న మిడిమిడి జ్ఞానపు 'మిడీ' పాప. విలాసంగా క్రాఫ్ సవరించుకుంటూ ఆ హాంకీనైనా కాకపోతిన నే విచార వదనుడైన బేగీ బాబు. దూరంగా కేంటీన్‌లోంచి మైకులో వినిపిస్తున్న పాట "బహుదూరపు బాటసారి, యిటురావోయ్ ఒక్కసారీ"

"పాట బావుంది కదూ" ఆకుచాటున ఒదిగిన మామిడి పిందెని అందుకోవడానికి ప్రయత్నిస్తూ అడిగింది.

బావు ...ంది కానీ ఆర్.టి.సి. కాంప్లెక్స్‌లో కా... ...ంటీన్‌లోంచి యింత గొడవ మధ్యా e... ...athomని ఎంజాయ్ చేయలేమేమో సా... ... అన్నాను. నిజమే కాసింత

ఆర్ద్రత ఉన్న ఏ పాటయినా ఉదయాన్నే ప్రత్యూషపు లేయెండ తాకిడికి కరిగే మంచు బిందువులని లాన్‌లో గడ్డిపూల రేకులమీద చూస్తూ అలా గతం తాలూకు జ్ఞాపకాలలోకి జారిపోయినపుడు అలాంటి పాటలు నేను బాగా యిష్టపడతాను.


కబుర్లలో పడి మూడు బస్సులు మిస్స య్యాం. ఆఖరికి కాసింత ఖాళీగా వున్న బస్సులో చివరి సీట్లో అనుకుంటూ, కిటికీ పక్కన తానూ, పక్కనే నేనూ. పగలూ రేయీ కలిసేవేళ కదిలే బస్సులోంచి దూరంగా అస్తమిస్తున్న సూర్యుణ్ణీ, ఉదయిం చే చంద్రుణ్ణీ చూస్తూ కబుర్లూ, కవిత్వం.

కాకినాడ చేరాం. అక్కడనుండి ఎడ్లబం డిమీద రెండు గంటలు ప్రయాణం. పట్నవాసపు నాగరికత ఫలశృతిగా నున్నని తారురోడ్డు. ప్రభుత్వపు రెడ్ టేపిజానికి చిహ్నంగా అక్కడక్కడా గతుకులు. రోడ్డుకి రువైపులా వరుసగా కొబ్బరి చెట్లూ, వాటినా నుకొని మాపుమేరలో పొలాలు. కొబ్బరాకు ల చాటునుంచి దోబూచులాడే వెన్నెలా, బండిలో మేమూ బండివాడూ కాక మరో యిద్దరో ముగ్గురో వారిలో ఎవరో పాటందుకున్నారు.

"యెన్నెలంతా మేసి ఏరు నిదురోయిం ది..." అని.

బస్ ప్రయాణం సరిపడక అలసటగా రెప్పలు వాలుస్తోంది సాహితి. కుదుపులకి తల బండి రాటకి కొట్టుకునే క్షణం చేయి అడ్డుపెడితే బుజంమీద వాలింది. ఊయల లో కేర్ మంటున్న పసిపాపని భుజాన వేసుకుని బుజ్జగిస్తున్న భావన. యిలాంటి కూతురో, చెల్లెలో, మేనకోడలో వుంటే బావుణ్ణన్న ఫీలింగ్. ఆ తర్వాతెప్పుడో ఓ సాయంత్రం డాబామీద కూర్చుని కీట్స్‌ని చదివి వినిపిస్తూ ఈ ఫీలింగ్ గురించి చెబితే కిసుక్కున నవ్వింది. విరిసిన మల్లెపూవులో మంచుబిందువు జారిపడిన సవ్వడి ఆ నవ్వులో.

అప్పుడే అనుకుంటూ అంది.



## ముద్దు!

ప్రేయసిని ప్రేమగా అడిగాడు ప్రియుడు.
"రాణీ... నేనెప్పుడు ముద్దిచ్చినా కళ్ళెందుకు మూసుకుంటావు"
"నీ అందాలమయిన ఫేస్‌ని క్లోజప్‌లో చూడలేక...
"
"...!!!..."

—ఐ.వి.జగన్నాధరావు,
విజయనగరం.

'ఇంటిమసీ పెరగడానికి మనుష్యుల మధ్య బంధుత్వాలు అవసరమా...? అని. నిజమే అవసరం లేదు. స్నేహమూ, స్వచ్ఛతా చాలు. కానీ ఒక్కోసారి కలిగే కొన్ని ఫీలింగ్స్‌కి లాజిక్ వుండదు. పాతికేళ్ల వయసులో భుజాన తల వాల్చిన 20 ఏళ్ల అమ్మాయిలో లేని కూతురునో, మేనకోడలినో చూడటం... యిదంతా విచిత్రంగా కనిపించవచ్చు. కానీ నాకాక్షణం అలాగే అనిపించింది. దీనికి Psychology ఏం చెబుతుందో నాకు తెలియదు. ప్రేయసిలోనో, భార్యలోనో తల్లిని ఒకో సందర్భంలో ఊహించడాన్ని వివరించిన Psychology. అప్పటికి మరో అరగంటలో నీలపల్లి మేం పెళ్ళికి వెళ్ళాల్సిన ఊరు చేరాం. బండి దిగి యిల్లు వెదుక్కుంటూ నడక – పల్లెటూరు కావడంతో పెళ్ళి యిల్లు పట్టుకోవడం పెద్ద కష్టం కాలేదు. మామూలు పలకరింపులయ్యాక కాఫీ, స్నానం. తర్వాత భోజనాలూ. షామ్యానా క్రింద టేబుళ్ళు పరిచో, టెర్రెస్‌పైన బఫేనో కాదు. కోనసీమ కొబ్బరాకుల పందిరికింద చాపలు పరచి, అరిటాకుల్లో భోజనాలూ, తాంబూలాలూ. అలసట తీరిపోయిందనుకుంటూ, 'పదండి కొబ్బరి తోటలు చూద్దాం' అంది. మళ్ళీ నడక. హోరు వినిపిస్తూ కంటికి కనిపించని ఏరు వెదుక్కుంటూ పొలం గట్టంబట నడక. ఓ ఏతాం పక్కన పొలం మధ్యలో లేత పచ్చికపై ఒద్దికగా కూర్చుని మళ్ళీ కబుర్లు. చిననాటి స్నేహాలు, చిలిపి అల్లరులూ– నాయనమ్మ తిట్లూ, గోదారిగట్టూ, కాలేజీ విశేషాలూ, యూనివర్సిటీ కబుర్లూ.. అన్నీ మూడుగంటల సేపు... మనసు లోతుల్లో నిక్షిప్తమయిన జ్ఞాపకాలు మాటలుగా జాలువారాక... ఒద్దికగా తలవంచుకుని, లేతగడ్డిపరకని మునిపంట కొరుకుతూ అడిగింది. "యింతకీ నేను మీ స్నేహితురాలినేనా..." అని. ఛెళ్ళున చెంపన కొట్టిన భావన.

"పిచ్చిపిల్లా అవునో కాదో నువే తేల్చుకో" అని నెత్తిన మొడితే...

"...అయితే మీ సరళ గురించి చెప్పండి" అని మరో ప్రశ్న.

–తొలి యవ్వనపు ప్రేమ, అది మిగిల్చిన విషాదం, గుండె జారిపోయిందో, గొంతు జీర పోయిందో... ఒక్కక్షణం మౌనం. తేరుకుని–

"నా కవిత్వానికి ఆమె ఊపిరి

నా జీవితం ఆమెకి ఉలిపిరి" (Tissue paper)

యింతకన్నా నేనేం చెప్పలేను అంటే... ఎదురుగావున్న సాహితిలోనూ ఏదో అస్పష్టమైన అలజడి. కొనగోట కన్నీటిని తుడిచింది. అరచేత తలని నిమిరింది.

"సారీ పద పోదాం ముహూర్తం వేళవుతోంది" అంది.

మళ్ళీ నడక వెన్నెల వాగులలో.

పెళ్ళి చూసి తెల్లారి బస్సెక్కి వస్తుంటే క్రిష్ణశాస్త్రిగారి 'అమృతవీణ' సంచిలోంచి తీసింది. పేజీలు తిప్పి ఓ గేయం తీసి చదవమంది.

"ప్రతి కోవెలకూ పరుగిడకు!
ప్రతి బొమ్మకు కైమోడ్చకు,
గతిమాలిన వెంగలివై, పాపము,

వెతకేవే పెన్నిధికై సతతము?
అసలడుగే పడకపోతేనో?
అసలాశలే అలసిపోతేనో?
విసిగి విసిగి నీ కన్నులలోపలి
వెలుగే ఆరిపోతేనో?
తీరని దాహము దేనికై, వే
సారని మోహము దేనిపై?
క్షీరజలధి నీలోనే నిండగ,
ఆరని దీపము, లోలో ఉండగ
ప్రతి కోవెలకూ-

యిదీ గేయం. యిప్పుడు పదాలన్నీ యధాతథంగా గుర్తులేవు. యిదంతా జరిగి పది సంవత్సరాలయింది.

ఈ పది సంవత్సరాలలోనూ జీవితంలో చాలా కష్టపడ్డాను. నిద్రలేని రాత్రులూ, తిండిలేని రోజులూ. ఉద్యోగం లేకుండా తిరుగుతున్నానని కొన్నాళ్ళూ, తర్వాత బ్యాంక్‌లో ఉద్యోగం వస్తే, నాలుగు నెలలు తిరక్కుండా పర్మనెంట్ ఉద్యోగాన్నివదిలేసి ఓ పత్రికలో విలేఖరిగా చేరానని కొన్నాళ్ళూ – నా చుట్టూ, నావాళ్ళనుకున్న వాళ్ళంతా పిచ్చివాణ్ణి చూసినట్టు చూసారు. ఎవర్నీ పట్టించుకోలేదు. తర్వాత ఆరు నెలలలో వాసిన ఐటమ్స్ అన్నీ బాగా క్లిక్ అయి స్టాఫ్ రిపోర్టర్‌గా ప్రమోషన్ వచ్చింది. ఆ తర్వాత చాలా విజయాలు సాధించాను. వృత్తిలో చాలా కష్టాలూ పడ్డాను. ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని కెమేరాలో బంధించిన సాక్ష్యాలూ, చుట్టూ వలలుపన్నే రాజకీయాలు – దేన్నీ కేర్ చేయలేదు. ఇప్పుడు Investigative journalistగా రచయితగా మంచి పేరుంది. ఏదో సాధిస్తున్నానన్న తృప్తే వుంది.

వీటన్నిటివెనకా స్ఫూర్తిగా, ప్రేరణగా నిలిచిన సాహితి వుంది. ప్రపంచం నన్ను వెలివేసి బలిచేయాలనుకున్నప్పుడు, వెన్ను తట్టి, వెన్నంటి నన్ను వెన్నెల వాగులలో నడిపించిన అమ్మాయి కోరిన కాసింత ఓదార్పుకోసం కోరని కంట తడినీ పంచిన పిచ్చిమనిషిని నేను.

అవునూ! ఈ జ్ఞాపకాలన్నింటినీ ఓ కథగా వ్రాస్తే? ట్విస్ట్‌లు లేకపోవచ్చు. అయితేనేం జీవితాన్ని మించిన కథ ఏం వుంటుంది. నిజమే వ్రాయచ్చు. కానీ పాఠకులకి ఏం చెప్పాలనీ? హిమస్నాత పునీత పారిజాతాల్లోని స్వచ్ఛత స్నేహంలో దొరికితే పాతికేళ్ల వయసులో ఫ్రస్ట్రేషన్ సైతం Inspirationగా మారుతుందనా? ఎన్ని కష్టాలొచ్చినా పెదవి చివరి చిరునవ్వు మాత్రం చెరిగిపోదనా?? ఏం చెప్పాలి నా పాఠకులకి? నా జీవితపు అపురూపమైన సంఘటనల తాలూకు జ్ఞాపకాలని అక్షరాలలో పొందుపరిస్తే ఎంతమంది అర్థం చేసుకుంటారు ఆ ఆర్తిని? అయినా ఎందుకో వ్రాయాలనే అనిపించింది. ఈ జ్ఞాపకాల ఒరవడి యింకిపోకముందే కలం, కాగితం అందుకున్నాను.

మలి సంజె చలిగాలి ఆగి పలకరించింది.

మబ్బు చాటు జాబిల్లి తొంగిచూసింది.

దూరంగా ఎక్కడినుంచో మైకులో పాట వినిపిస్తోంది.

స్నేహ బంధమూ... ఎంత మధురమూ ...